క్లుప్తంగా

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాల దిశను పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: దుకాణదారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద శనివారం దుకాణదారులతో మాట్లాడి సీసీ కెమెరాల దిశను రోడ్లవైపు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దుకాణంతో పాటు రోడ్డువైపు సీసీ కెమెరా దిశ ఉండడం వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహిళా అధ్యక్షురాలిగా ప్రవళిక



శ్రీకాళహస్తి: ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా దాసరి ప్రవళిక ఎన్నికయ్యారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ మహాసభ నిర్వహించారు. దాసరి ప్రవళికను పట్టణాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చుట్టు గురవయ్య, డేవిడ్, మునిలక్ష్మి, రాధమ్మ, నాగరాజు పాల్గొన్నారు.

సబ్ జైల్ సందర్శన



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ శనివారం సబ్‌జైల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలు తప్పక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బెయిల్, న్యాయం, చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఏ సమస్య ఉన్నా అర్జీరూపంలో ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

గుడిమల్లంలో గంభీరానంద భారతి స్వామి



ఆలయంలో గంభీరానంద భారతి స్వామి

రేణిగుంట: ఏర్పేడు మండలం గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామిని శనివారం జగద్గురు గంభీరానంద భారతి స్వామి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగత ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బస్తాల గిరినాయుడు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఎండీ పుత్తూరులో ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్ మోహన ప్రియ

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం యండి పుత్తూరులో శనివారం సాయంత్రం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల వర్షాలకు, పొలాల్లో నాట్లు వేయడంతో దోమలు పెరిగాయని, దోమల వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల దష్ట్యా ఫాగింగ్ చేయించినట్లు వివరించారు.

బార్‌లా తెరిచేశారు!



రేణిగుంట మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్

- ఇష్టారాజ్యంగా పర్మిట్ రూమ్‌లు
- మామూళ్ల మత్తులో అధికారులు

శ్రీకాళహస్తి: వైన్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. వైన్ షాపుల వద్ద ఏర్పాట్లు చేస్తున్న వసతులు బార్లలో కూడా ఉండడం లేదన్న చర్చ సాగుతోంది. వైన్‌షాపులంటే వైన్స్ పక్కనే ఏర్పాటు చేస్తున్న పర్మిట్‌రూములు అన్నమాట. రీటైల్ మద్యం షాపుల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూములను బార్లను తలపిస్తున్నాయి. నిబంధనలు గాలికి వదిలి పెద్దపెద్ద రేకుల షెడ్లు వేసి బెంచీలు, టేబుళ్లు వేసి యథేచ్ఛగా సిట్టింగులను నడిపిస్తున్నా కూడా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయా వైన్‌షాపుల చుట్టుపక్కల నివాస గృహాలు ఉన్నా కూడా పర్మిట్ రూములను నడిపిస్తున్నారు. నిర్ణీత కొలతల ప్రకారం ఒక చిన్న గదిలో మాత్రమే పర్మిట్ రూములను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో ఎలాంటి బెంచీలు, టేబుళ్లు కానీ వేయకుండా నిర్వహించాలి కేవలం గ్లాసులు, మందు సీసాలు పెట్టుకునేందుకు మాత్రమే గోడకు చెక్కలు వేయాల్సి ఉంది. కానీ ఒక్కో వైన్‌షాపు యజమాని పెద్దపెద్ద షెడ్లను ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు. బార్లతో పోలిస్తే వైన్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూములలో సకల వసతులు ఉండేలా నిర్వాహకులు దృష్టి సారిస్తున్నారు. బార్లలో మందులోకి కావాల్సి స్టఫ్ ఆర్డర్ వేసిన 20 నిమిషాల తరువాత వస్తాయి. ఇక్కడ మాత్రం రెడీగా ఉంటాయి. వాటిని క్షణాల్లో తీసుకుని పర్మిట్ రూమ్‌లోకి వెళ్లి కావాల్సినంత సేపు మద్యం తాగుతున్నారు. ఒక్కో వైన్‌షాపు యజమాని పెద్దపెద్ద షెడ్లను ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు.

తినుబండారాలపై పర్యవేక్షణ కరువు

పర్మిట్‌రూముల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్న తినుబండారాలపై సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో విక్రయదారులు ఇష్టానుసారంగా కుళ్లిపోయిన నాసిరకమైన వస్తువులు విక్రయిస్తున్నారని మందు బాబులు పేర్కొంటున్నారు. ఒకరోజు క్రితం మిగిలిపోయిన కరవాడు, శెనగలు, పల్లీ, కోడిగుడ్లు, చికెన్ తదితర దుర్వాసనలు వెదజల్లుతున్నా యథేచ్ఛగా విక్రయిస్తున్నారని బయట నుంచి తెచ్చుకుంటామంటే అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్తీ నూనెలు, నాసిరకమైన ఆహార పదార్థాలు పెడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న విక్రయదారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విచ్చలవిడిగా అనుమతులు

పట్టణంలో మద్యం షాపుల వద్ద ఎక్సైజ్ అధికారులు విచ్చలవిడిగా పర్మిట్ రూములకు అనుమతులు ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఇచ్చి వసతులు ఎలా ఉన్నాయో అధికారులు పర్యవేక్షించడంలో విఫలమవుతున్నారు.

బార్లలో ఎనీటైం మద్యం

శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో మూడు బార్లు ఉండగా మద్యం షాపుల వద్ద ఏర్పాటు చేసిన పర్మిట్ రూములలో తగ్గిన వ్యాపారాన్ని పెంచుకోవడానికి బార్లలో ఎనీటైం మద్యం పాలసీ పెట్టేశారు. అధికారులు ప్రశ్నిస్తే పర్మిట్ రూములతో నష్టం జరుగుతోందని అందుకే ఎక్కువ సమయం తీసుకోవాల్సి వస్తుందని తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఎన్ని గంటలకు తెరుస్తారో ఎన్నిగంటలకు మూస్తారో అనే దానిపై నియంత్రణ లేదు. బార్లలో ఎనీ టైం మద్యం విధానం అమలు చేస్తున్నారు. దీంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పర్మిట్ రూముల్లోనే ఎక్కువ ఆదాయం గడిస్తున్నారని బార్ల యజమానులు వాపోతున్నారు.



ఏర్పేడు వద్ద మద్యం దుకాణం ముందు ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్



మిట్టకండ్రిగ వద్ద మద్యం దుకాణం వెనుక ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్

మద్యం, మాంసం దుకాణాలు మూసేయండి

శ్రీకాళహస్తి రూరల్/రేణిగుంట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మద్యం, మాంసం దుకాణాలు మూసివేయాలని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర తెలిపారు. గణతంత్ర దినోత్సవం రోజున పాటించాల్సిన నిబంధనలపై శనివారం వారు మీడియాతో మాట్లాడారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మద్యం దుకాణాలు, మాంసం విక్రయ కేంద్రాలన్నీ మూసివేయాలని ఆదేశించారు. అన్ని చికెన్, మటన్, చేపల మార్కెట్లు మూసివేయాలని సూచించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాస్త్రోక్తం.. తైలాభిషేకం



ప్రత్యేక అలంకారంలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని తహసీల్దార్ సుబ్రమణ్యం హెచ్చరించారు. ఆయన శనివారం మధ్యాహ్నం ఎంఈఓ రవీంద్రనాథ్‌తో బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బియ్యం నాణ్యత లేకపోతే తన దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తానమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్‌ఐ రామస్వామి, ఎంఈవో కే.రవి

సత్యవేడు: పేదవిద్యార్థుల చదువుకు సహకారం అందించిన బిలీవ్ ఎఫెక్టివ్ సర్వీస్ ట్రస్టు అధ్యక్షుడు ఎస్.శరవణన్, సభ్యులను ఎస్‌ఐ రామస్వామి అభినందించారు. సత్యవేడు రాంనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 50 మందికి శనివారం బిలీవ్ ఎఫెక్టివ్ ట్రస్టు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, వాటర్ బాటిళ్లు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, జామెంట్రీ బాక్సులను ఎంఈవో కే.రవి, ఎస్‌ఐ, ఎంఈవో-2 ఉష అందజేశారు. మండల పరిధిలో 10కి పైగా పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు వితరణగా ఇచ్చారన్నారు. స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.గీత, ఈబీ గురునాథం, ట్రస్టు సభ్యులు కృష్ణవేణి, కార్తీక్, శశికల, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ దామోదార్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నియమాలు పాటించాలని శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదార్‌నాయుడు, బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు హెచ్చరించారు. వారు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే కూలీలను ఎక్కువ మందిని ఆటోల్లో ఎక్కించకూడదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమార్తన్ పథకం కింద నగదు బహుమతి అందజేస్తామన్నారు.

సీనియర్ ఓటర్లకు చిరు సత్కారం





ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ సురేష్ బాబు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రేణిగుంటలో శనివారం తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రధాన వీధిలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ సురేష్ బాబు మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని, విద్యార్థులు ఇంటర్ సెకండ్ ఇయర్‌కి వెళ్లిన వెంటనే ఓటు హక్కు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఎంఈఓలు రంగనాథ్, ఇందిరాదేవి, ప్రధానోపాధ్యాయిని విష్ణువర్ధణి, అర్బన్ సీఐ శరత్ చంద్ర, ఎస్‌ఐ అరుణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ జాలిరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని సూళ్లూరుపేట డీఎల్‌డీవో జాలిరెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని 9,060 ఇళ్లను సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 7,314 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వర్ణ పంచాయతీ సర్వేలో ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేస్తారని, దీంతో హౌస్ ట్యాక్స్‌ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఈ నెలాఖరుకు సర్వేను పూర్తి చేసి, ఆన్‌లైన్ ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం







సత్యవేడు: ర్యాలీలో విద్యార్థులు, అధికారులు, బీఎన్‌కండ్రిగ: విద్యార్థులు, అధికారుల ర్యాలీ, నారాయణవనం: ప్రతిజ్ఞ చేయిస్తున్న జయరాములు

సత్యవేడు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని ఎంఈవో కె.రవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రామస్వామి, ఆర్‌ఐ సురేష్, ఎంఈవో ఉషా పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సీనియర్ మహిళా ఓటరును సన్మానించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో రవీంద్రనాథ్, ఆర్‌ఐ నల్లయ్య పాల్గొన్నారు.

నారాయణవనం: మండల కేంద్రంలో తహసీల్దార్ జయరాములు ఆధ్వర్యంలో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేయించారు.

వరదయ్యపాళెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తహసీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ రకాల పోటీల్లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో తహసీల్దార్ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలి చేపట్టారు. హెచ్‌ఎం కస్తూరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కిమ్స్ కళాశాలలో..

శ్రీకాళహస్తి: మండలంలోని కాపుగున్నేరిలో గల స్కిమ్స్ కళాశాలలో కరస్పాండెంట్ మిద్దెల హరి ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం నుంచి కూడలి వరకు తహసీల్దార్ భార్గవి, రెవెన్యూ సిబ్బంది విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ మానవహారం నిర్వహించారు. ఎంపీడీఓ సౌభాగ్యం, సర్పంచుల సంఘం అధ్యక్షులు నల్లపాలెం శివయ్య, ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. పాపానాయుడు పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో - ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకట సుబ్బమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేశారు.







నాగలాపురం : ర్యాలీలో అధికారులు, ఉపాధ్యాయులు, శ్రీకాళహస్తి: స్కిమ్స్ కళాశాలలో ఓటర్ల దినోత్సవం, ఏర్పేడు: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ భార్గవి

28న ఉద్యోగ మేళా

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ అధికారులు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీసిటీలో బహుళజాతి కంపెనీలు వీల్స్ ఇండియా, బ్లూస్టార్, ముత్తూట్, ఏరియాస్ ఆగ్రో కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ చేస్తారని పేర్కొన్నారు. ఆధార్ జిరాక్సు, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ముందుగా https://shorturl.at/oogzi రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440374535, 9491458910ను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఏకాదశి ఉత్సవం



ఊరేగింపులో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏకాదశి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సాయంత్రం మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం అర్చకులు సుప్రభాతంతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజలు చేశారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి, తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం మకర తోరణ తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామిని అధిష్ఠించి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆస్థానం చేపట్టారు. ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్ కుమార్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరకంబాడి రాస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మహిళా సమాఖ్య సమావేశంలో జిల్లా ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ మహిళలకు ఎల్‌సిడిసి, కుష్ఠు వ్యాధి, డెంగీ, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధిగా నిర్ధారణ జరిగితే ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉన్నట్లైతే దోమలు వృద్ధి చెందుతాయని, దోమకాటు వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, కంటిలో నొప్పి మొదలైన డెంగీ వ్యాధి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది రమణమ్మ, ఆశ కార్యకర్త, మహిళలు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి



స్థానికులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

నారాయణవనం: గ్రామాలకు వస్తున్న 104 వాహనం వద్ద వైద్య సేవలను పొందాలని మండల వైద్యాధికారి దర్శిత్‌రాజు తెలిపారు. ఆయన శనివారం వెత్తలతడుకు, కసిమిట్టలో 104 వాహనం ద్వారా చికిత్సలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో క్రమం తప్పకుండా 104 వాహనం వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నామన్నారు. అలాగే పాఠశాలల్లో పిల్లలకు ప్రతి బుధ, శనివారాల్లో రక్త హీనత పరీక్షలను నిర్వహించి, లోపాలున్న వారికి మెరుగైన వైద్య సేవల కోసం తిరుపతికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు.



